అర్హులను ఎప్పటిలోగా ఎంపిక చేస్తారు

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనలో ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్/బన్సీలాల్‌పేట్/హిమాయత్‌నగర్ జనవరి 3: ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వారిలో అర్హులను ఎప్పటిలోపు ఎంపిక చేస్తారనే విషయంలో సరైన స్పష్టత లేకపోవడం వలన ప్రజలు అయోమయానికి గురి కావల్సి వస్తుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన నల్లగుట్టలో పర్యటించే సమయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈనెల 6 వరకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోమని చెప్పిందే తప్పా ఎప్పటిలోగా అర్హులను ఎంపిక చేస్తామనేది చెప్పలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ శంకరయ్య, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, కిరణ్మయికిశోర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు ఆంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా పాలన కేంద్రంలో దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

ఆరు గ్యారంటీ పథకాల కోసం ఈ నెల 6లోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు అన్నారు.

ప్రజా పాలన గడువును పొడిగించాలి

ప్రజాపాలన గడువును పొడిగించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.బుధవారం విఠల్‌వాడిలో ఉన్న ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు ఓ.పావని సామాజిక సేవ చేస్తున్నందున బుధవారం సావిత్రిబాయి పూలే పురస్కార అవార్డును మంత్రి సీతక్క అందజేసి శాలువాతో సన్మానించారు.– బన్సీలాల్‌పేట

షేక్‌పేట కార్పొరేటర్‌కు బెదిరింపు కాల్స్..కేసు నమోదు

బంజారాహిల్స్,జనవరి 3: గుర్తుతెలియని వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించాడని షేక్‌పేట కార్పొరేటర్ రషీద్ ఫరాజుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేట డివిజన్ ఎంఐఎమ్ కార్పొరేటర్ రషీద్ ఫరాజుద్దీన్ ఇటీవల శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో తాను చేసిన ప్రసంగాల్లో రౌడీయిజం రూపుమాపుతా అంటూ మాట్లాడిన విషయాలను గుర్తుచేస్తూ ఈ నెల 1న గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేసి, రెండు రోజుల్లో నీ అంతుచూస్తానని హెచ్చరించాడంటూ రషీద్ ఫరాజుద్దీన్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐపీసీ 507 సెక్షన్ కింద బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

6, 7 తేదీల్లో పోల్కి జువెలరీ ఎగ్జిబిషన్

కళ్లు చెదిరే వజ్రాభరణాలు, వెడ్డింగ్ కలెక్షన్లతో బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో జనవరి 6,7 తేదీల్లో ఆభరణాల ప్రదర్శనను 'పోల్కి జువెలరీ ఎగ్జిబిషన్' పేరుతో నిర్వహించనున్నామని జైపూర్‌కు చెందిన జేకేజే జువెలర్స్ సంస్థ ప్రకటించింది. బుధవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో టాలీవుడ్ హీరోయిన్లు ప్రీతి కుమార్, మిస్ ఇండియా తెలంగాణ –2023 ఊర్మిళా చౌహాన్ పాల్గొని సందడి చేశారు. ఎగ్జిబిషన్‌కు సంబందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.
– బంజారాహిల్స్,జనవరి 3

సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహేశ్ యాదవ్, హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

సావిత్రీబాయిపూలేతోనే..మహిళలకు గుర్తింపు

బంజారాహిల్స్/ఖైరతాబాద్/హిమాయత్‌నగర్,జనవరి 3: మహిళలకు విద్యద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని బలంగా నమ్మిన సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.కే.సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొ. ఘంటా చక్రపాణి, పాలకమండలి సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొలి ఉపాధ్యాయురాలికి నివాళి

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి జయంతి సందర్భంగా ఖైరతాబాద్‌లోని బడా గణేశ్ మండపంలో ఆమె చిత్రాపటానికి బీఆర్ఎస్ నాయకులు మహేశ్ యాదవ్, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సింగరి రాజ్ కుమార్, సందీప్ రాజ్ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, ఆనంద్, సురేందర్, కుమార్, రాకేశ్, ఎం. విశాల్ బాబు, సచ్‌దేవ్, నాని, శ్రీను, రతన్, లక్ష్మణ్, శివ, కేశవ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం..

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని,సావిత్రీ బాయి పూలేను స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ,మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి పిలుపు నిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్ వద్ద సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు నిర్వ హించారు.కార్యక్రమంలో నాయకురాలు సదాలక్ష్మి, నళిని,సహాయ కార్యదర్శి లతాదేవి,జంగిడి లక్ష్మి,అమీనా తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్..రిమాండ్

హిమాయత్‌నగర్,జనవరి 3: వ్యసనాలకు అలవాటు పడి సెల్‌ఫోన్లను స్నాచింగ్ చేస్తున్న ముగ్గురు నిందితులను బుధవారం నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం బషీర్‌బాగ్‌లోని హోటల్ షిర్డీ క్రిస్టల్ రూమ్ బాయ్‌గా పనిచేస్తున్న అనాథర్వేది అర్జున్,తన స్నేహితుడు నాయల్ సింగ్‌తో కలిసి మంగళవారం హైదర్‌గూడలోని ఓ హోటల్‌లో భోజనం చేసి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో కాలపత్తర్‌లో నివాసం ఉండే మహ్మద్ అఫ్రోజ్(22),నవాబ్ సాహెబ్ కుంటకు చెందిన సల్మాన్‌బేగ్(26), ఫయాజ్‌ఖాన్(34)లు కలిసి నెంబర్ లేని ఆటోలో ఎదురుగా వచ్చి అనాథర్వేది అర్జున్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడు అనాథర్వేది అర్జున్ ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనా స్థలంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. పాతనేరస్తులు మహ్మద్ అఫ్రోజ్,సల్మాన్‌బేగ్‌లనుఅదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు.వారి వద్ద నుంచి చోరీ చేసిన సెల్‌ఫోన్‌తో పాటు ఆటోను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్, ఎంఐఎం నాయకుల మధ్య గొడవ

బంజారాహిల్స్, జనవరి 3: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద టేబుల్స్ ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ కార్యకర్త పై దాడికి దిగిన ఎంఐఎం కార్యకర్తపై బంజారాహిల్స్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని సయ్యద్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌వద్ద ప్రజాపాలన దరఖాస్తులను నింపడంలో సాయం చేసేందుకు అహ్మద్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ కార్యదర్శి సయ్యద్ ఇమ్రాన్ తదితరులు టేబుల్ ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఐఎం నాయకులు సాదేఖ్, అజ్జూ, అక్తర్, ఫయాజ్, ముజీబ్ తదితరులు టేబుల్‌ను తీసేయాలని సూచించారు. అయితే తాను టేబుల్‌ను తీసేయనని చెప్పడంతో మాటామాట పెరిగింది. దీంతో ముజీబ్ ఆగ్రహంతో సయ్యద్ ఇమ్రాన్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముజీబ్‌పై ఐపీసీ 323, 504, 290, 341 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆకతాయిలకు 7 రోజుల జైలుశిక్ష

బేగంపేట్ జనవరి 3: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఐదుగురికి సికింద్రాబాద్ కోర్టు బుధవారం 7 రోజుల జైలు శిక్ష విధించింది. మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మార్కెట్‌కు చెందిన సందీప్ క్యాటరింగ్ పని చేస్తుంటాడు. మంగళవారం పని ముగించుకొని హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో కింగ్స్ దర్బార్ చౌరస్తా వద్ద ఐదుగురు ఆకతాయిలు పూటుగా మద్యం తాగి వచ్చి సందీప్‌పై దాడి చేశారు. సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మార్కెట్ పోలీసులు నిందితులను పట్టుకొని వారిపై ఈ పెట్టీ కేసు పెట్టి న్యాయస్థానంలో హాజరు పరిచారు. రాణిగంజ్ ప్రాంతానికి చెందిన అలీమ్ (18), సత్యం కుమార్(21) సుమన్‌కుమార్ (20) నీరజ్ కుమార్ (19). శివం మిస్రా (21)నిందితులు ఐదుగురికి న్యాయస్థానం 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఫిలింనగర్‌లోని బీజేఆర్ నగర్‌కు చెందిన టి.గోపాల్ (50) మంగళవారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం గాలింపు చేస్తున్న క్రమంలో ఫిలింనగర్ సాయి బాబా ఆలయం సమీపంలోని సీ–40 భవనం గేటులోపల అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తేలింది. మద్యం మత్తులో వచ్చి గేటు లోకి వచ్చి కిందపడి పోయి చనిపోయాడని అక్కడే ఉన్న మార్క రవీందర్, రమిత్‌కుమార్ చెప్పారు. అయితే తన తండ్రి ముఖంపై గాయం కనిపించడంతో పాటు ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని గోపాల్ కొడుకు నరేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

బేగంపేట్ జనవరి 3: బాలికను వేధిస్తున్న యువకుడిపై బేగంపేట్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ వరలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రసూల్‌పుర ప్రాంతానికి చెందిన బాలిక (16) సికింద్రాబాద్‌లోని ఓ క్లాత్ స్టోర్‌లో పని చేస్తుంది. ప్రతిరోజూ పనికి వెళ్తున్న సమయంలో శ్రీలంక బస్తీలోని కరీం(22) వెంట పడుతూ వేధిస్తుండేవాడు. మంగళవారం కూడా ఆ బాలికను ప్యారడైజ్ మెట్రో స్టేషన్ వద్ద కరీం అడ్డుకొని బెదిరించాడు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు బేగంపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మాయం

బంజారాహిల్స్,జనవరి 3: ఆఫీస్ ముందు పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మాయమైన ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మణికొండ సమీపంలోని అలకాపురి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న నాగరాజు కేదారి అనే ఫ్యాషన్ డిజైనర్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఆరల్ స్టూడియో లో విధులు నిర్వహిస్తుంటాడు. గత నెల 11న ఆఫీసుకు వచ్చిన నాగరాజు తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను పార్కింగ్ ప్లేస్‌లో పెట్టి సాయంత్రం స్నేహితుడితో కలిసి కారులో వెళ్లిపోయాడు. కాగా మరుసటిరోజు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హాస్టల్ ముందు పార్క్‌చేసిన బైక్ చోరీ

హాస్టల్ ముందు పార్క్ చేసిన బైక్ చోరీ అయిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న వి.రమేష్ షేక్‌పేటలోని ప్రశాంత్‌రెడ్డి బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. తన సోదరుడికి చెందిన కేటీఎమ్ డ్యూక్ బైక్‌ను కొంతకాలంగా వాడుతున్న రమేష్ గత నెల 31న రాత్రి డ్యూటీనుంచి వచ్చి హాస్టల్ బయట పార్కింగ్‌లో పెట్టాడు. మరుసటి రోజు ఉదయం బైక్ కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.